క్లుప్తంగా...

కృతజ్ఞతలు



మేడ్చల్: నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ప్రకటించడంతో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల కొమ్మల నరికివేత కారనంగా బుధవారం మండలంలోని పలు కాలనీలు, గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈలు శశిధర్‌రెడ్డి, పవన్‌చందు తెలిపారు. పట్టణంలోని బ్యాంక్ కాలనీ, మార్కెట్ ప్రాంతం, కింది బస్తీ, చాకలి బస్తీ, బృందావన్‌కాలనీ, ఏకలవ్యనగర్, జ్యోతినగర్, ఆర్టీసీ కాలనీ, సూర్యనగర్, మల్లికార్జుననగర్, రావల్‌కోల్ తండాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

షీలా ఫోమ్ కంపెనీలో వేతన ఒప్పందం



పత్రాలు మార్చుకుంటున్న కార్మికులు, యాజమాన్య ప్రతినిధులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి పరిధిలోని షీలా ఫోమ్ కంపెనీలో బీఆర్‌టీయూ యూనియన్ కార్మికులకు, యాజమాన్యానికి మధ్య వేతన ఒప్పందం కుదిర్చింది. బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో వేతన ఒప్పందం చేసుకున్నారు. యూనియన్ నాయకులు, యాజమాన్య ప్రతినిధులు పత్రాలు అందజేసుకున్నారు.

కేశవరంలోని ఓ ఇంట్లో చోరీ

శామీర్‌పేట్: కేశవరంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామంలో నివాసం ఉండే కంచుగంట్ల లక్ష్మీ, పటాన్‌చెరులోని తన బంధువుల ఇంటికి వెళ్లి మంగళవారం సాయంత్రం వచ్చింది. తన ఇంటి తాళం ధ్వంసమై ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించింది. 20 తులాల వెండి, రూ.10 వేల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునీందర్ తెలిపారు.

బీఎస్పీలోకి సుంకర నరేష్



కుషాయిగూడ: కుషాయిగూడకు చెందిన ప్రముఖ న్యాయవాది, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకర నరేష్ బీఎస్పీలో చేరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మేనిఫెస్టో ఆవిష్కరణ కార్యక్రమంలో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆయనను ఆహ్వానించారు. సమాజంలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయడం కోసమే ఏర్పడ్డ బీఎస్పీలో పార్టీలో చేరడం సంతోషంగా ఉందని నరేష్ అన్నారు.

పేదలు, వికలాంగులకు చేయూత



అల్వాల్: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్త్రీశక్తి ఫౌండేషన్ చైర్మన్, సినీ నటుడు రాజేంద్రకుమార్ పేదలు, వికలాంగులకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై జీవిస్తున్న పేదలు, వికలాంగులకు ఆయన చేయూత అందజేశారు.

ఓటింగ్ శాతం పెంపు లక్ష్యం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్

- పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు
- గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరిక
- పోలింగ్ కేంద్రాలు.. సిబ్బంది అంతా సిద్ధం
- మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 26.91 లక్షలు
- పోలింగ్ కేంద్రాలు 2,397.. ఇందులో వెయ్యి క్రిటికల్
- ఎన్నికల నిర్వహణకు 12 వేల సిబ్బంది



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతం కంటే ఓటింగ్ శాతం పెంపు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 30 వరకు ఓటు నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల అధికారులు పూర్తి సమన్వయంతో విధుల నిర్వహణకు ఎప్పటికప్పుడు సమీక్షలతోపాటు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మీడియాతో పరిచయ కార్యక్రమంలో భాగంగా ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను వివరించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నవంబర్ 3 నుంచి 15 వరకు నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, ఉపసంహరణ వంటి ప్రక్రియలన్నీ పూర్తవుతాయన్నారు. నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3 ఓట్ల లెక్కింపు వరకు అవసరమైన చర్యలు, ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలు పక్కాగా..

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని, శాసనసభ ఎన్నికలకు సంబంధించి 16 విభాగాలకు 22 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్సు బృందాలు, ఎంసీఎంసీ కమిటీతోపాటు ఇతర కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్లు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రజల ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ– విజిల్ యాప్ అందుబాటులో ఉంచామన్నారు. నగదు లావాదేవీలు, డబ్బు, బంగారం వంటివి రవాణా చేసేటప్పుడు ఆధారాలు ఉండాలని, రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్నట్లయితే.. అందుకు తగిన రుజువులు, ధ్రువీకరణ పత్రం జత చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2050కు ఫోన్ చేయవచ్చునని పేర్కొన్నారు. సీ– విజిల్ 24 గంటలు పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

ఓటర్లు 26.91 లక్షలు.. పోలింగ్ కేంద్రాలు 2,397.. సిబ్బంది 12 వేలు

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 26,91,167 మంది ఓటర్లు ఉన్నారని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది జాబితాను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఓటరు తుది జాబితా ప్రకారం నియోజకవర్గాల వారిగా మేడ్చల్‌లో 5,95,382 మంది ఓటర్లు ఉండగా, మల్కాజిగిరిలో 4,68,822 మంది, కుత్బుల్లాపూర్‌లో 6,69,253 మంది, కూకట్‌పల్లిలో 4,47,523 మంది, ఉప్పల్ నియోజకవర్గంలో 5,10,167 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో సర్వీస్ ఓట్లు 729 ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 2,397 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 1000 వరకు క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అంచనా వేశామని, ఈ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు 12 వేల మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

సువిధ యాప్‌తో సభలకు అనుమతులు

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు 'సువిధ యాప్' ద్వారా సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాలు, లౌడ్ స్పీకర్లు, ఇంటింటి ప్రచారం, డిసిప్లే బ్యానర్లు, భారీకేడ్లు, పార్టీలకు చెందిన ఫ్లాగ్‌లకు సంబంధించి అనుమతులు పొందవచ్చని పేర్కొన్నారు. గుర్తింపు పొంది రిజిస్ట్రేషన్ చేసుకున్న పార్టీల నుంచి ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు 'సువిధ యాప్' ద్వారా 48 గంటల్లో అనుమతులు పొందవచ్చన్నారు. ఈ యాప్ అనుమతి పొందిన 72 గంటల పాటు వ్యాలిడిటీ ఉంటుందన్నారు.

నేడు మేడ్చల్‌లో కేసీఆర్ సభ





ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నియోజకవర్గంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ప్రజాఆశీర్వాద సభ నిర్వహిస్తోంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 70 వేల మందితో నిర్వహిస్తున్న సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈ మేరకు సభా ప్రాంగణాన్ని అన్ని వసతులతో సిద్ధం చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకోనుండగా సాయంత్రం 4.30 గంటల సమయంలో సభా వేదిక వద్దకు కేసీఆర్ చేరుకోనున్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు.

ముమ్మర ఏర్పాట్లు.. నిమగ్నమైన మంత్రి..

సీఎం కేసీఆర్ మొదటిసారి మేడ్చల్‌లో పార్టీ బహిరంగ సభలో పాల్గొననుండటంతో మంత్రి మల్లారెడ్డి ప్రతిష్టగా తీసుకున్నారు. కేసీఆర్ మెప్పు పొందేలా, పెద్ద ఎత్తున సభ విజయవంతం చేసేందుకు మల్లారెడ్డి ప్లాన్ చేశారు. ఈ మేరకు వారం రోజులుగా గుండ్లపోచంపల్లిలోని సభాస్థలి వద్ద ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తన కుమారుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్‌కు పలు బాధ్యతలు అప్పగించడంతో వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు నిర్వహిస్తున్నారు. మంత్రి మల్లారెడ్డి దగ్గరుండి సభా వేదిక, కేసీఆర్ హెలీకాప్టర్ ల్యాండింగ్ ప్రదేశం, సభా స్థలికి చేరుకునే దారి, కార్యకర్తలు, నాయకుల సభాస్థలికి చేరుకునే తీరు, వాహనాల పార్కింగ్ వంటి విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. మంగళవారం సభ స్థలిలో ఏర్పాట్లను మంత్రి మల్లారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరిశీలించారు. పోలీసులు, నాయకులతో ఏర్పాట్లపై చర్చించారు.

తెలంగాణలో కాంగ్రెస్ గద్దెనెక్కేది ఖాయం

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్



కాచవానిసింగారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యరి వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: తెలంగాణలో కాంగ్రెస్ గద్దెనెక్కేది ఖాయమని, విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. కాచవానిసింగారం ఆర్‌కే ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా వారి ఆత్మహత్యలకు కారణమైందన్నారు. దళితలకు దళిత బంధు, మూడెకరాల భూమి ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ మోసాలు, అబద్ధపు హామీలు, కాంగ్రెస్ గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం కాంగ్రెస్ అమలు చేయనున్న ఆరు హామీలను ఇంటింటికీ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జంగమ్మ, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

శామీర్‌పేట్: పేదవాడికి కాంగ్రెస్ మాత్రమే న్యాయం చేస్తుందని ఆ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. అనంతరం పల్లె నిద్రలో భాగంగా రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రతి పేదవాడికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, పలు సంఘాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత అధికారులపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కూకట్‌పల్లి జేఎన్టీయూలోని పోలింగ్ డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్, రిటర్నింగ్ అధికారి కార్యాలయం, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ అధికారుల సమన్వయంతో ర్యాంప్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ కోసం సరైన విద్యుత్తు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనల తర్వాత పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో అన్నీ వసతులు ఉన్నాయని ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్‌కు ఎలాంటి అవాంతరాలు జరగకుండా ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రకాశ్, ఈఆర్వో రమేష్, ఎఈఆర్‌ఓలు, వివిధ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల్లో జిల్లా సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని, వారు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన సెక్టోరియల్ అధికారులతో పాటు ప్రతి నియోజకవర్గానికి సంబంధించి 10 మంది చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చామన్నారు. సెక్టోరియల్ అధికారులు ఎన్నికలకు సంబంధించిన శిక్షణ పొందిన తర్వాత వారు జిల్లాలోని పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల శిక్షణలో ఈవీఎంలపై కూడా అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ అధికారులు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశూరామ్, జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, జెడ్పీ సీఈవో దేవసహాయం, జిల్లాస్థాయి ఎన్నికల శిక్షకులు తిరుమలేష్ పాల్గొన్నారు.

హరివర్ధన్‌రెడ్డిని బుజ్జగించిన మైనంపల్లి



మీడియాతో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

మేడ్చల్: మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో అసమ్మతితో ఉన్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని మల్కాజిగిరి ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంత్‌రావు, నియోజకవర్గ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి బోయిన్‌పల్లిలోని హరివర్ధన్‌రెడ్డి నివాసానికి వెళ్లి సమావేశమయ్యారు. పార్టీ అధికారంలోకి వస్తుందని భవిష్యత్‌లో న్యాయం చేస్తామని ఆయన హరివర్ధన్‌కు నచ్చజెప్పారు. సమష్టిగా పనిచేసి మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

మల్లు రవి మంతనాలు..

అలకబూనిన హరివర్ధన్‌రెడ్డిని బుజ్జగించేందుకు టీపీసీసీ తరఫున మల్లు రవి రంగంలోకి దిగారు. మల్లు రవి నేరుగా బోయిన్‌పల్లిలోని హరివర్ధన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఇంట్లో రహస్యంగా సమావేశం నిర్వహించారు. టికెట్ విషయంలో అన్యాయం జరిగినా పార్టీ తగిన సమయంలో గౌరవం ఇస్తుందని పార్టీ గెలుపుకోసం కష్టపడాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్‌తో సమాజాన్ని అధ్యాయనం చేయవచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ మల్లేశ్

ఘట్‌కేసర్: ఎన్ఎస్ఎస్‌తో సమాజాన్ని అధ్యాయనం చేయవచ్చని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నీలిమా వైద్యశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మంగళవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాలను సందర్శించి ప్రజల జీవన విధానం, ఆరోగ్య సమస్యలు గమనిస్తుండంతో పాటు సమాజ సమస్యల గుర్తించేందు అవకాశం ఇస్తుందన్నారు. వైద్యవిద్యార్థుల ఆరోగ్య సమస్యలు త్వరగా అర్థం చేసుకొని ఆ సమస్యలకు ప్రొఫెసర్ల సహాయంతో తమ అధ్యయన పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిష్కారాలను ప్రయత్నిస్తారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి నవీన్, లక్ష్మీప్రసన్న, నీలిమా వైద్యకళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో పోలీసుల కవాతు



మేడ్చల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, జాతీయ రహదారి మీదుగా కేఎల్ఆర్ నగర్ వరకు పోలీసులు కవాతు చేశారు. కవాతులో మేడ్చల్‌తో పాటు పలు పోలీస్‌స్టేషన్లను చెందిన పోలీసులు పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు కార్యక్రమం చేపట్టినట్లు ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీఐ నర్సింహారెడ్డి, ఎస్ఐలు నవీన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కాలినడకన శబరికి అయ్యప్పలు

అంబర్‌పేట: శ్రీ ధర్మస్థా పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో ఈనెల 19న శబరికి పాదయాత్రతో అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్తున్నట్లు బృందం గురుస్వామి వెంకటేష్‌యాదవ్ మంగళవారం ప్రకటించారు. పాదయాత్ర బృందంతో అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే భక్తులు తమ బృందంలో చేరవచ్చని, ఉచిత భోజనం వసతి కల్పిస్తామని వెల్లడించారు. సికింద్రాబాద్ గణేష్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర సుమారు 38 రోజుల పాటు కొనసాగి అయ్యప్ప స్వామి దర్శనానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 9989693921.

శ్రీపోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

మౌలాలి: గోకుల్‌నగర్‌లో మంగళవారం శ్రీపోచమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు హాజరై పూజలు నిర్వహించారు. పూలపల్లి మాధవ్‌యాదవ్, రాము యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, కాశీ విశ్వనాథ్‌యాదవ్, జగదీష్‌యాదవ్, రఘుయాదవ్, పూలపల్లి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని అల్వాల్ హిల్స్‌లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేస్తూ అలరించారు. మహిళా అధ్యాపక బృందం కూడా బతుకమ్మ ఆట పాటలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కూడా బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తుంటే ఒక్కసారిగా ప్రాంగణం కేరింతలతో మార్మోగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన గుండ్లపోచంపల్లి యువకులు



బీఆర్ఎస్‌లో చేరిన గుండ్లపోచంపల్లి యువత

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన యువకులు మంగళవారం పెద్ద ఎత్తున మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం సభ ప్రాంగణం వద్ద నిర్వహించిన చేరికల కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి యువకులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు సంజీవగౌడ్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..



హెచ్‌బీకాలనీలో బీఎల్ఆర్‌కు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కుషాయిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తానంటూ బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. మంగళవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మహిళలు ఆయనకు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. కైలాసగిరి, ఇందిరానగర్, లక్ష్మీనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు బోదాసు రవి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, పూస రమేష్ అలివేలు, భారతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



గడప గడప కార్యక్రమంలో వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 7, 8, 9 డివిజన్‌ల్లో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బాధలు తెలిసిన వ్యక్తిగా మీ ముందుకు వస్తున్నా.. నన్ను ఆశీర్వదించండి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పిలుపునిచ్చారు. ఏడో రోజు గడప గడప కార్యక్రమంలో ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్‌గౌడ్, విశ్వంగుప్తా, నేతలు బొమ్మక్ రమేష్, హరినాథ్‌రెడ్డి, తోటకూర అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం



ఏకలవ్యనగర్‌లో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఏకలవ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏకలవ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఎన్నికల తర్వాత కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీకి చెందిన చిట్టిబాబు తన బృందంతో బీఆర్ఎస్‌లో చేరారు. ఏకవల్యనగర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, వేణునాయుడు తదితరులు పాల్గొన్నారు.